రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

రాయపర్తి, డిసెంబర్ 24: వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లా పురుషులు, మహిళల ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలకు జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల సాయికుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని కబడ్డీ క్రీడాకారులు వినియోగించుకోవాని కోరారు.

'సంరక్ష'లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సంరక్ష వైద్యశాలలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు

కాశీబుగ్గ, డిసెంబర్ 24: వరంగల్ నర్సంపేటరోడ్డులోని సంరక్ష సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ అజిత్ మహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చర్చి ప్రెసిడెంట్ ఎల్లయ్య పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం సిబ్బందికి బహుమతులు ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ బందెల మోహన్‌రావు, లక్ష్మీదీపక్, శ్రావణి, శ్రీనివాస్, పోలా నటరాజు, సరిత, ఉషారాణి, కస్తూరి ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

'యేసు మార్గంలో నడవాలి'

పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న జాన్ మార్కండేయ

కాజీపేట, డిసెంబర్ 24 : ప్రతి ఒక్కరూ ఏసు ప్రభువు చూపిన మార్గంలో నడవాలని అల్ఫా ఓమెగా హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ చైర్మన్ జాన్ మార్కండేయ అన్నారు. కాజీపేట బాపూజీనగర్‌లోని అల్ఫా ఓమెగా చర్చిలో సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిఖిల్ జాన్, రమేశ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో పాల్గొన్న హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, పీ ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా

వరంగల్‌లోని లేబర్‌కాలనీలో ముస్తాబైన సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

విద్యుత్ వెలుగుల్లో కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థనామందిరం

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు

క్రిస్మస్ వేడుకలకు వరంగల్, హనుమకొండ జిల్లాలోని చర్చిలు ముస్తాబయ్యాయి. కరుణాపురంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరం, ఫాతిమానగర్‌లోని చర్చి, వరంగల్‌లోని లేబర్‌కాలనీలోని సీబీసీతోపాటు నగరంలోని అన్ని చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, పశువుల పాకలు ఆకట్టుకున్నాయి.

ఫాతిమానగర్‌లో ముస్తాబైన చర్చి

క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి బాటలు : అరూరి

పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న అరూరి రమేశ్

న్యూశాయంపేట, డిసెంబర్ 24 : ఏసు బోధనలతో ప్రపంచ శాంతికి బాటలు పడ్డాయని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. హంటర్‌రోడ్డులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని పాస్టర్లు, సేవకులు, పేద క్రైస్తవ కుటుంబాలకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ శాంతియుత పంథాలో తెలంగాణ రాష్ట్రం సాధించారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో రాజు, ఎంపీపీలు అప్పారావు, కమల పంతులు, జడ్పీటీసీ భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ ఏలేందర్, కార్పొరేటర్లు రజిత, సునీల్, షీభారాణి, సరోజన, అరుణ పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులతో జీవించాలి : పెద్ది

కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, డిసెంబర్ 24: ఏసు క్రీస్తు దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ఫాదర్లతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నామాల సత్యనారాయణ, మునిగాల వెంకట్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గుంటి కిషన్, నాగిశెట్టి ప్రసాద్, దార్ల రమాదేవి, జ్యోతి, బండి ప్రవీణ్, చంద్రమౌళి, గోనె యువరాజు, గోల్య, రాంబాబు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో చిర్ర రాహూల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శ

ధర్మసాగర్, డిసెంబర్ 24 : ధర్మసాగర్‌లో ఇటీవల మృతి చెందిన చిర్ర రహుల్, సురుగురి వెంకటయ్య, చాడ సుశీల కుటుంబాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ ఎర్రబెల్లి శరత్‌చంద్రప్రసాద్, ఎంపీటీసీలు జాలిగపు వనమాల, బొడ్డు శోభ, మాజీ జడ్పీటీసీ వాసు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మడికొండ, డిసెంబర్ 24 : గ్రేటర్ 57వ డివిజన్ సమ్మయ్య నగర్‌కు చెందిన రాజేశ్‌కు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు రూ.10లక్షలు అవసరం కాగా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.5లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రం కుట్ర..

హనుమకొండ చౌరస్తా : ఎల్‌ఐసీని ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఎమ్మెల్యే నాయిని అన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం 37వ వార్షిక సదస్సు హనుమకొండలోని డివిజనల్ ఆఫీస్‌లో జరిగింది. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రవి, తిరుపతయ్య, వరంగల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు భాస్కర్, కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థినిని లైంగికంగా వేధించిన
శ్రీచైతన్య కళాశాల చైర్మన్ అరెస్టు
కళాశాల ఇన్‌చార్జినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు

అరెస్ట్ చూపిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

సుబేదారి, డిసెంబర్ 24 : హనుమకొండ భీమారంలోని శ్రీచైతన్య ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థినిని లైంగికంగా వేధించిన కళాశాల చైర్మన్ బూర సురేందర్‌గౌడ్, కళాశాల ఇన్‌చార్జి దొంతి శ్రవణ్‌ను కేయూ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం హనుమకొండ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ కిరణ్‌కుమార్ నిందితుల అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న అర్ధరాత్రి విద్యార్థినిని లైంగికంగా వేధించగా, తల్లిదండ్రులకు చెప్పింది. వారి ఫిర్యాదుతో ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు వడ్డేపల్లి చర్చి వద్ద సురేందర్‌గౌడ్, శ్రవణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

కళాశాలకు షోకాజ్ నోటీసులు

హనుమకొండ సిటీ : భీమారంలోని తెలంగాణ శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోపాల్ తెలిపారు. విద్యార్థులపై చైర్మన్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని వివిధ పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా ఆదివారం కళాశాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, సిబ్బంది నుంచి వివరాలను సేకరించామన్నారు. పరిశీలనలో వెలుగులోకి వచ్చిన ఆధారాల కనుగుణంగా కళాశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ప్రాథమిక రిపోర్టును ఇంటర్ బోర్డు కార్యదర్శికి నివేదించామని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ఏడుగురికి గాయాలు

నర్సంపేటరూరల్, డిసెంబర్ 24: ట్రాక్టర్ బోల్తా పడి ఏడుగురు కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన ఆకులతండా శివారు లైన్‌తండాలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆకులతండాకు చెందిన ఓ రైతు చేనులో పత్తి ఏరేందుకు ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామానికి చెందిన మహిళా కూలీలు ట్రాక్టర్‌లో వెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న కూలీలు నార్లకంటి మల్లికాంబ, బండోజు శోభ, వల్లపు రామక్క, జాగంటి అచ్చమ్మతోపాటు మరో ముగ్గురు గాయపడ్డారు. వారికి నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. అందులో నలుగురిని మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు.

లింగాపురంలో వృద్ధుడి ఆత్మహత్య


బుచ్చిరెడ్డి(ఫైల్)

చెన్నారావుపేట, డిసెంబర్ 24: పురుగు మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగాపురంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మందాటి(65) బుచ్చిరెడ్డి, తన సోదరుడు కుమారస్వామికి మధ్య కొంతకాలంగా ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన అతడు ఈ నెల 22న క్రిమిసంహారక మందు తాగాడు. ఈ మేరకు అతడిని హనుమకొండలోని ఓ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కాగా, బుచ్చిరెడ్డి గతంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడిగా పని చేశాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని బుచ్చిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం
నర్సంపేట వాసి మృతి

నర్సంపేట, డిసెంబర్ 24: అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సంపేటకు చెందిన మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని వ్యాపారి, కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు రుద్ర మల్లీశ్వరి-ఓంప్రకాశ్ దంపతుల కుమారుడు వంశీ, కోడలు లావణ్య కొన్నేళ్ల నుంచి అమెరికాలోని డల్లాస్‌లో ఉంటున్నారు. కోడలు హోంఫుడ్స్ వ్యాపారం చేస్తున్నది. ఈ క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లావణ్య మృతి చెందింది. లావణ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన కణుజు
కిలో రూ. 800 చొప్పున విక్రయం?

ఖానాపురం, డిసెంబర 24: మండలంలోని చిలుకమ్మనగర్ గ్రామానికి చెందిన కొందరు వేటగాళ్లు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఉచ్చుకు ఆదివారం రాత్రి కణుజు బలైంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ శివారులో కొందరు వేటగాళ్లు ఉచ్చులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఉచ్చుకు కణుజు చిక్కింది. వెంటనే వేటగాళ్లు కణుజును హతమార్చి కిలోకు రూ.8 వందల చొప్పున 110 కిలోల మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. కణుజు మాంసాన్ని స్థానికంగానే కాకుండా నర్సంపేటతోపాటు ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించినట్లు సమాచారం.

శివనగర్‌లో కారు దహనం

ఖిలావరంగల్, డిసెంబర్ 24: వరంగల్ శివనగర్‌లో శనివారం అర్ధరాత్రి కారును దహనం చేశారు. సీసీ ఫుటేజీలో బాధితుడి అన్న కుమారుడు, వదిన కారును తగులపెడుతున్న దృశ్యాలు కనిపించాయి. బాధితుడు ఇనుముల అజయ్ కథనం ప్రకారం.. ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన టవేరా వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారు. దీంతో బాధితుడు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అయితే, తన అన్న భార్య హైమావతి, కుమారుడు మహేశ్ వాహనంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు సీసీ కెమెరాల్లో స్పష్టంగా కనిపించిందని అజయ్ తెలిపాడు. డయల్-100కు సమాచారం అందిస్తే స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అజయ్ చెప్పారు.

PUBLIC NOTICE

Under the intructions of my client M/s. Shriram Finance Limited Narsampet Branch. I issue the following notice to general public. My client intends to grant Loan to A. Padmaja W/o Laxman Resident of H.No. 9-29, Vill: Akulathanda, Mdl: Narsampet, Dist. Warangal by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes, Mortgages, Sale Agree-ments, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 Days from the date of this notice. Other wise later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

వరంగల్లు జిల్లా రిజిస్ట్రారు, నర్సంపేట సబ్-రిజిస్ట్రారు గారి పరిధిలో, జిల్లా పరిషత్ వరంగల్, మండల పరిషత్, నర్సంపేట, రెవెన్యూ గ్రామం, ఇటికాలపల్లి/గ్రామ పంచాయతి ఆకులతండలో వార్డు నెం.9 లో ఇ.నెం. 9-29 గల ఆర్.సి.సి. కప్పుతో నున్న ఇల్లు మరియు ఇంటికి చెందిన ఖాళీస్థలంతో యుక్తంగా మొత్తం విస్తీర్ణం: 344 చ.గ.లు సరియగు 287.68 చ.మీ.లు ఆర్.సి.సి. ప్లింత్ ఏరియా 757 చ.ఫీ.లు గల దానికి హద్దులు: ఉత్తరం: బానోతు నర్సింహా గారి ఇల్లు, దక్షిణం: భూక్య దేవుల గారి ఇల్లు, తూర్పు: దారావత్ చిన్న గారి ఇల్లు మరియు ప్రపోజుడు రోడ్, పడమర: 12 ఫీట్ల ప్రపోజుడు రోడ్.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HANAMKONDA, Warangal. Cell: 9849365117

బాధితులకు పరిహారం అందించాలి
ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు, డిసెంబర్ 24 : ఆత్మకూరు నుంచి ఎనుమాముల మార్కెట్‌కు వెళ్లే డబుల్ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన ఆత్మకూరుకు చెందిన బాధితులు ఆదివారం హనుమకొండలోని రేవూరి ప్రకాశ్‌రెడ్డి నివాసంలో కలిసి బిల్లులు ఇప్పించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు వెంటనే డబ్బులు ఇప్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ డీఈ లింగారెడ్డికి సూచించారు. ఆత్మకూరులో నిలిచిపోయిన కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సభలకు హాజరై సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్వతగిరి రాజు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ ఎస్సై శ్రావణికి పురస్కారం

రైల్వే పురస్కారం అందుకుంటున్న శ్రావణి

కాజీపేట, డిసెంబర్ 24 : కాజీపేట రైల్వే ఆర్పీఎఫ్ ఎస్సై శ్రావణికి రైల్వేశాఖ విశిష్ట రైల్వే పురస్కార్ అందజేసింది. అవార్డును దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకే జైన్ హైదరాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రావణికి అవార్డు అందజేశారు.

'ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం'

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 24 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, ప్రతిపక్ష పార్టీల ఎంపీల సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఆదివారం వరంగల్ పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, నలిగంటి రత్నమాల, అరూరి కుమార్, దుర్గయ్య, ప్రశాంత్, కట్టప్ప, జుబేదా, మహేశ్, ఉదయ్, కిరణ్, అరుణ్, సాయి ప్రవీణ్, అరవింద్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కరీమాబాద్, డిసెంబర్ 24: ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని కార్పొరేటర్లు గుండు చందన, అరుణ అన్నారు. 43వ డివిజన్ గణేశ్‌నగర్ కాలనీలో రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్-2023 కరాటే పోటీలను ఆదివారం వారు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దామెర, డిసెంబర్ 24: హనుమకొండ పెద్దమ్మగడ్డ-కేయూరోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దామెరకు చెందిన ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. దామెరకు చెందిన గుజ్జుల ప్రశాంత్‌రెడ్డి(45), దామెర శంకర్, ఊరుగొండకు చెందిన మల్లాడి మల్లారెడ్డి బైక్‌పై దామెర నుంచి పెద్దమ్మగడ్డ-కేయురోడ్డులోని యాదవనగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రశాంత్‌రెడ్డి మృతి చెందాడు.

మంత్రి సురేఖను కలిసిన మెట్టుగుట్ట సిబ్బంది

మడికొండ: దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆదివారం ఆమె నివాసంలో మెట్టుగుట్ట దేవస్థానం ఈవో శేషుభారతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెట్టుగుట్ట అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను వివరించారు.

27న జేఎన్‌ఎస్‌లో పారా అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్

మాట్లాడుతున్న పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ ప్రశాంత్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 24 : రాష్ట్ర స్థాయి 6వ పారా అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ ఈ నెల 27న హనుకొండలోని జేఎన్‌ఎస్‌లో నిర్వహించనున్నట్లు పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ గాడిపల్లి ప్రశాంత్ తెలిపారు. ఆదివారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. సుమారు 250మంది దివ్యాంగ క్రీడాకారులు పాల్గొంటారని వారికి రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. హాజరయ్యే క్రీడాకారులకు టీషర్ట్స్, ఫుడ్ అకామిడేషన్ కల్పిస్తామని, విజేతలను జనవరి 9 నుంచి 14 వరకు గోవాలో జరిగే 22వ జాతీయ క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ తలారి సంజీవయ్య, ప్రెసిడెంట్ సింగారాపు బాపు పాల్గొంటారని చెప్పారు. వివరాలకు 9000683937, 9550514603, 8184913535 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అనిల్, యాకూబ్‌పాషా, కల్యాణ్, శ్రీనివాస్, శ్రీశైలం పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఎంపికైన జట్టుతో స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి శ్రీనివాసరావు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 24 : తమిళనాడులోని తిరుచురాపల్లి భారతీదాస్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే హాకీ (పురుషుల) టీంను విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య శ్రీనివాసరావు ప్రకటించారు. కోచ్‌గా సయీద్ యాసిన్, మేనేజర్‌గా రమేశ్‌ను నియమించారు. అలాగే కేరళలోని క్యాలికట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో (పురుషుల) టీంను ప్రకటించారు. జట్టు మేనేజర్‌గా రాజేశ్ వ్యవహరిస్తారు. బెంగళూరు జైన్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ (మహిళా) టీంకు మేనేజర్‌గా ఇఫ్రాన్ మహ్మద్ వ్యవహరిస్తారు. భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ (మహిళా) టీంను ప్రకటించారు. వీరికి మేనేజర్‌గా వినోద్ వ్యవహరిస్తారు. ఎంపికైన క్రీడాకారులను వీసీ ప్రొఫెసర్ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు అభినందించారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 24 : ఏలూరులో అభినవ నృత్య భారతి ఆధ్వర్యంలో జరిగిన 28వ అంతర్జాతీయ స్థాయి నృత్యోత్సవంలో బండారి తేజస్విని అరగంట పాటు పేరిణి నాట్యం చేసి జాతీయస్థాయి యువ పేరిణి నృత్య కౌముది అవార్డు పొందారు. ఈ సందర్భంగా వరంగల్ దేశాయిపేటరోడ్డులోని నటరాజ కళాకృష్ణ అకాడమీలో తేజస్వినిని ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు గజ్జెల రంజిత్‌కుమార్, అకాడమీ అధ్యక్షురాలు మోతుకూరి చంద్రకళ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి చాతరాజు నవ్యజ, అంజలి, పద్మ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఎదుట ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న మారయ్య

ఆటో కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి

- పొట్టకొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య

ఖిలావరంగల్, డిసెంబర్ 24: ఆటో కార్మికులకు నెలకు రూ. 15 వేల చొప్పున జీవన భృతి చెల్లించాలని ఆటో యూనియన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం మారయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఆటో అడ్డా డ్రైవర్లతో మహాలక్ష్మీ పథకం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసేందుకు కార్మిక విభాగం నుంచి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కమిటీ వేశారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 వేల మంది ఆటో కార్మికులు ఉన్నారన్నారు. ఈ పథకానికి ముందు రోజువారీగా ఒక్కో ఆటో డ్రైవర్ రూ. 1000 నుంచి రూ. 1500 వరకు సంపాదిస్తే.. నేడు రూ. 500 కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు తమ సమస్యలను నివేదిక రూపంలో కేటీఆర్‌కు ఇచ్చి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఆయన వెంట బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు, సురేశ్, రమేశ్, బాలనరసింహ, సాయికుమార్, శ్రీనివాస్, సంజీవబాబు పాల్గొన్నారు.

శివనగర్‌లో భారీ చోరీ
80 తులాల బంగారం, రూ.7 లక్షల నగదు అపహరణ

ఖిలావరంగల్, డిసెంబర్ 24 : విహారయాత్రకు వెళ్లినందుకు దొంగలు ఇల్లు గుల్లా చేసిన ఘటన శివనగర్‌లో జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. శివనగర్‌కు చెందిన వ్యాపారి రాయల రవి ఈ నెల 11న కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లాడు. యాత్ర ముగించుకొని ఈ నెల 26న వరంగల్‌కు రావల్సి ఉంది. ఈ క్రమంలో ఇంట్లో దొంగతనం జరిగిందని స్థానికులు, పోలీసులు ఇచ్చిన సమాచారంతో రవి తన కుటుంబ సభ్యులతో కలిసి హుటాహుటిన ఆదివారం ఇంటికి వచ్చాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి మూడు గదుల్లో ఉన్న బీరువాలను తెరిచారు. అందులో ఉన్న 80 తులాల బంగారు ఆభరణాలు, రూ. 7 లక్షల నగదును అపహరించారు. అలాగే, మరికొన్ని వెండి వస్తువులు కూడా కనిపించడం లేదని బాధితుడు వాపోయాడు. అతడి ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

గూడూరు గ్రామంలో..

కమలాపూర్ : మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన గుండా సారమ్మ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. సారమ్మ ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లగా, తాళం పగులగొట్టి దుండగులు రూ.5వేల నగదు,నాలుగు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఆధారాలు దొరక్కుండా ఇల్లంతా కారంపొడి చల్లినట్లు బాధితురాలు చెప్పింది.

స్వర్గరథ వాహనం అందజేత

భీమదేవరపల్లి, డిసెంబర్ 24 : మండలంలోని గట్లనర్సింగాపూర్‌కు చెందిన బైరి వెంకట్రాజం తన తల్లిదండ్రులు లచ్చమ్మ-కనుకయ్య, అతడి భార్య సరోజ జ్ఞాపకార్థం ఆదివారం రూ. 7లక్షల విలువైన సర్గరథం వాహనాన్ని గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, సర్పంచ్ ఎర్రబెల్లి చంద్రకళ, బైరి జగన్మోహన్, పూర్ణచందర్, కేశవప్రసాద్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గీసుగొండ, డిసెంబర్ 24 : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆక్యుటీ సౌజన్యంతో ఆదివారం మండలంలోని పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న 25 పాఠశాలల్లోని 400 మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎన్‌టీ డాక్టర్ శరత్‌బాబు, క్లబ్ అధ్యక్షుడు అన్నం రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Computer Operators, GNM Nurses, OT-Technicians & Compounders. Cont: Guardian Hospital, Opp: L.B. College, Warangal. Time: 12pm to 2 pm.
NTW-0325

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314383

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565